

నీటి కుంట.. పంటకు లాభమంట

ఫాంపాండ్ల తవ్వకంతో లాభాలు ఉన్నందున తవ్వకంపై రైతుల ఆసక్తి మేరకు వివిధ శాఖల అధికారులు ప్రోత్సహిస్తున్నారు. 8లో



సమస్యలు పరిష్కరించే వరకు..

స్థలాలు, ఇళ్ల మంజూరుతో పాటు పేదల సమస్యలన్నీ పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తామని సీపీఎం నాయకులు తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 27°

వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. సాయంత్రం తర్వాత కొన్ని ప్రాంతాల్లో జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున స్వామి మూల విరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదానికి పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. ఆతర్వాత స్వామి, అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి తెలంగాణ, ఏపీ నుంచి భారీగా హాజరైన భక్తుల సమక్షాన నిత్యకల్యాణం, పల్లకీ సేవ చేశారు. పెళ్లిళ్ల సీజన్‌కు తోడు పాఠశాలలకు సెలవులు కావడంతో స్వామి దర్శనానికి భక్తులు బారులుదీరారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాపై సమాచారం ఇవ్వండి

ఖమ్మంక్రైం: పశువుల అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. అంతేతప్ప సంస్థల బాధ్యులు చట్టాన్ని అతిక్రమించి వాహనాలను అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. పశువుల రవాణా విషయంలో వివాదాలు తలెత్తకుండా ఇప్పటికే ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటుచేశామని వెల్లడించారు. చట్టవిరుద్ధంగా ఆవులు, దూడలను రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా పండుగ జరుపుకునేలా అవసరమైన చోట్ల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీపీ వివరించారు.

వర్షాలు వచ్చేలోగా మరమ్మతులు పూర్తి



కట్ట నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీఈ

కూసుమంచి: పాలేరులోని మినీ హైడల్ ప్రాజెక్టు(జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం)లో మరమ్మతులను వర్షాలు మొదలయ్యేలోగా పూర్తిచేయాలని జెన్‌కో నాగార్జునసాగర్ ప్రాజెక్టు సీఈ(ఓ అండ్‌ఎం) మంగేష్ కుమార్ ఆదేశించారు. ప్రాజెక్టు పనులను శనివారం పరిశీలించిన ఆయన ఉద్యోగులకు సూచనలు చేశారు. షెడ్యూల్ ప్రకారం పనులు చేపట్టి వర్షాలు మొదలుకాగానే విద్యుత్ ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రాజెక్టుకు నీటిని సరఫరా చేసే కాలువ కట్ట కొట్టుకుపోయిన చోట మరమ్మతులను కూడా సీఈ పరిశీలించారు.

ప్రజలకు సౌకర్యంగా వీధివ్యాపారుల ప్రాంగణం



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంమయూరిసెంటర్: మౌలిక వసతుల కల్పనలో రాజీ పడకుండా ప్రజలకు అసౌకర్యం లేకుండా వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని తీర్చిదిద్దలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. ఖమ్మం పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని శనివారం తనిఖీ చేసిన ఆయన వ్యాపారులతో మాట్లాడారు. మార్చి 12న కలెక్టర్ తనిఖీ చేసినప్పుడు వెల్లడైన సమస్యల పరిష్కారంపై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు సూచనలు చేశారు. ఇందులో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు, నిర్మిస్తున్న షెడ్లను పరిశీలించి నాణ్యత ప్రమాణాల ప్రకారం గడువులోగాపనులు పూర్తిచేయాలని తెలిపారు. కలెక్టర్ వెంట మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, అధికారులు ఉన్నారు.

ఊరంతా.. ఖాతా!

- పోస్టల్ అకౌంట్లలో వల్లభి ముందంజ
- పొదుపు బాటలో 90శాతం గ్రామస్తులు
- అత్యధిక ఖాతాలతో జిల్లాలో అగ్రస్థానం

సండే స్పెషల్

సంపాదించిన సొమ్మంతా ఎప్పటికప్పుడు ఖర్చు చేస్తే ఆపద, అవసరాలకు ఇతరుల వద్ద చేయి చాచాల్సి వస్తుంది. ఒకవేళ ప్రైవేట్ సంస్థల్లో చీటీలు వేయాలన్నా, పొదుపు చేయాలన్నా భయం వెంటాడుతుంటుంది. అందుకే పోస్టాఫీస్, బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు, డిపాజిట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే, ప్రజలకు సరైన అవగాహన లేక పోస్టాఫీసు సేవలను సద్వినియోగం చేసుకోవడం లేదు. కానీ ముదిగొండ మండలంలోని వల్లభి గ్రామస్తులు మాత్రం అందుకు భిన్నంగా ముందుకు సాగుతూ పొదుపులో మేటిగా నిలుస్తుండడం విశేషం. – ముదిగొండ

వల్లభి గ్రామ వాసులు 90శాతం మందికి చిన్న మొత్తాల పొదుపు ఖాతాలు ఉన్నాయి. పైసాపైసా కూడబెట్టుకున్న డబ్బును గ్రామ పోస్టాఫీస్‌లో వివిధ పథకాల ద్వారా పొదుపు చేస్తూ అవసరాలకు వాడుకుంటున్నారు. క్రమం తప్పకుండా ఖాతాదారులు చిన్న మొత్తాలు జమ వేసుకుంటుండగా.. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడుతుండడంతో ఒకరిని చూసి ఇంకొకరు అన్నట్లుగా ఖాతాదారులు పెరిగారు. వల్లభిలోని పోస్టాఫీస్‌లో ప్రతీనెలా రూ.100 మొదలు రూ.2వేలు, రూ.5వేలు వరకు జమ చేస్తున్న వారు ఉన్నారు. పింఛన్‌దారులు, వ్యవసాయదారులు, ఉద్యోగులు, పేద, మధ్య తరగతి ప్రజలు ఇలా అన్ని వర్గాల వారు పొదుపు ఖాతాల్లో నగదు జమ చేసుకుంటున్నారు. రోజురోజుకు పెరుగుతున్న అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఆర్థిక స్థోమత పెంచుకోవడమే లక్ష్యంగా కష్టార్జితంగా సంపాదించిన సొమ్ములో కొంత మేర పొదుపు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఏడు వేల జనాభా

గ్రామంలో 7వేల జనాభా ఉండగా 1,500 గృహాలు, ఓటర్లు దాదాపు 4,700మంది ఉంటారు. జనాభాలో 90శాతం మందికి పోస్టాఫీస్‌లో ఖాతాలు ఉండడం విశేషం. జిల్లాలోనే అత్యధిక ఖాతాలు కలిగిన పోస్టాఫీస్‌గా వల్లభి నిలుస్తోంది. ఇక ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు సేవలను వెయ్యి మంది సద్వినియోగం చేసుకుంటున్నారు. దీంతో పాటు టైమ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్(ఆర్‌డీ) ఖాతాదారులు ఉండగా.. తపాలా శాఖ ద్వారా వివిధ రకాల బీమా కూడా చేయించుకుంటున్నారు. పోస్టల్ ఉద్యోగులు ఖాతాదారులను ప్రోత్సహిస్తూ.. ఎప్పటికప్పుడు కొత్త పథకాలపై అవగాహన కల్పిస్తుండడంతో కొత్త ఖాతాలు పెరుగుతున్నాయి. బ్యాంకులతో పోలిస్తే నగదు జమ, విత్‌డ్రా సులువుగా ఉండడం, దూరం వెళ్లకుండా గ్రామంలోనే సేవలు అందుబాటులో ఉండడంతో జనం ఆసక్తి కనబరుస్తున్నారు.



పోస్టాఫీస్‌లో నగదు జమ కోసం వచ్చిన వల్లభి వాసులు

లెక్కకు మిక్కిలిగా..

వల్లభి పోస్టాఫీస్‌లో రికరింగ్ డిపాజిట్లు(ఆర్‌డీ) 1,420 ఉన్నాయి. అలాగే, నిర్ణీత కాల పరిమితితో టైమ్ డిపాజిట్లు(టీడీ) 275, ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు ఖాతాలు(ఐపీపీబీ) వెయ్యి కొనసాగుతున్నాయి. ఇంకా జనరల్ పాలసీలు(జీపీ) 650, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్(పీఎల్ఐ) 25, గ్రామీణ తపాల బీమా(ఆర్‌పీఎల్ఐ) 700, సుకన్య సమృద్ధి యోజన 250తో పాటు ఎస్‌బీలు 300 ఉండడం విశేషం.

పొదుపుపై ఆసక్తి...



గ్రామంలో ఒకరిని చూసి ఒకరు పొదుపునకు ముందుకొస్తున్నారు. దాదాపు అందరూ ఏదో ఖాతా తెరిచి డబ్బు జమ చేసుకుంటున్నారు. గ్రామస్తులకు పోస్టల్ పథకాలపై అవగాహన కల్పిస్తుండడంతో ఆసక్తి కనబరుస్తున్నారు.
– ఎస్.కే.జరీనా, బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్

నెలకు రూ.2వేల జమ



పోస్టాఫీస్‌లో ప్రతీనెల రూ.2వేలు జమ చేస్తా. పిల్లల భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడేలా సుకన్య సమృద్ధి యోజన పథకం ఖాతా తెరిచాను. పిల్లలు పెద్దయ్యే లోగా వారి చదువు, ఇతర ఖర్చులకు ఉపయోగపడతాయనే నమ్మకం ఉంది.
– సూరపల్లి ఎల్లమ్మ

పదేళ్ల నుంచి దాచుకుంటున్నా..



ప్రతీనెల ఆర్‌డీ కడుతున్నా. పింఛన్ సొమ్ములో కొంత మొత్తం పోస్టాఫీ‌లో జమ చేస్తున్నా. ఎప్పుడు అవసరం వచ్చినా తీసుకోవడం పోస్టాఫీస్‌లోనైతేనే వీలుగా ఉంటుంది. అన్ని అవసరాలకు డబ్బే ప్రధానమని పదేళ్ల నుంచి జమ చేసుకుంటున్నా.
– ఎనిక భద్రమ్మ

నలుగురం పొదుపు చేస్తాం..



మా కుటుంబంలో నలుగురి పేరిట ఆర్‌డీలు కడుతున్నాం. చాలా కాలం నుంచి పొదుపు అలవాటుగా మారింది. అత్యవసర పరిస్థితిలో వాడుకుంటూ.. మళ్లీ డబ్బు ఉన్నప్పుడు జమ చేస్తాం. పొదుపుతో చాలా ఉపయోగాలు ఉన్నాయి.
– చేకూరి రామారావు

ఇప్పుడైతేనే పని సులువు

- రోడ్ల మరమ్మతులపై దృష్టి సారిస్తే మేలు
- జిల్లాలో గ్రామీణ లింక్‌రోడ్ల పనులపై అనిశ్చితి
- బిల్లుల పెండింగ్‌తో పనులకు కాంట్రాక్టర్ల నిర్లిప్తత

ఖమ్మంఅర్బన్: వర్షాకాలం సమీపిస్తోంది. వర్షాలు జోరందుకుంటే రహదారుల మరమ్మతు పనులు చేపట్టడం సాధ్యం కాదు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నెలారంభం నుంచే మరమ్మతులు చేయించాల్సి ఉన్నా అధికారుల వైపు నుంచి చొరవ కానరావడం లేదు. జిల్లావ్యాప్తంగా అనేక చోట్ల గ్రామీణ లింక్ రోడ్లుగా ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రహదారులపై గుంతలు తేలగా.. చెట్టుకొమ్మలు రహదారిపైకి పెరగడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు ప్రమాదకరంగా మారాయి. వీటి స్థానంలో కొత్త రోడ్లు వేయకున్నా, ఉన్న రోడ్లనైనా మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలైతే సిద్ధం

ప్రతీ ఏడాది వర్షాకాలానికి ముందు రహదారులపై గుంతలు పూడ్చడం, రోడ్లకిరువైపులా మట్టి చదును చేయడం, చెట్ల కొమ్మలు తొలగించడం వంటి పనులను వార్షిక నిర్వహణలో భాగంగా చేపట్టాల్సి ఉంటుంది. కానీ రెండేళ్లుగా ఆర్‌అండ్‌బీలో పనులు



పండితాపురం సమీపాన రహదారిపై ఏర్పడిన గుంతలు

చేసిన కాంట్రాక్టర్లకు సుమారు రూ.20 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండగా, వారు ఈసారి పనులపై ఆసక్తి చూపడం లేదని సమాచారం. అయినప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం వార్షిక నిర్వహణ పనుల కోసం టెండర్లకు అంచనాలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో సుమారు 1,200 కి.మీ. మేర రహదారులు ఉండగా, కిలోమీటర్‌కు సగటున రూ.20లక్షల చొప్పున రూ.20 కోట్లతో అంచనాలు రూపొందిస్తున్నట్లు సమాచారం. కానీ గతంలో పని చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ఈ ఏడాది పనులపై స్పష్టత రావడం లేదు.

పీఆర్ రోడ్ల పరిస్థితీ అదే

వర్షాకాలానికి ముందు రహదారి పనులు పూర్తిచేస్తే బాగుండని వాహనదారులు భావిస్తున్నారు. జిల్లాలో ఆర్‌అండ్‌బీ పరిధిలోని రహదారులే కాక పంచాయతీ రాజ్ రహదారులు సైతం దెబ్బతిన్నాయి. రహదారిపై కనిపించేది చిన్న గుంతలే అయినా అవి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దెబ్బతిన్న రోడ్లకు తోడు రహదారులపైకి చొచ్చుకొచ్చిన కంపచెట్లు, రోడ్డు అంచుల వెంట మట్టి దిగపడడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈనేపథ్యాన త్వరగా స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

తుపాన్‌తో దెబ్బతిన్నవి..

గత ఏడాది తుపాన్ కారణంగా అనేక చోట్ల రహదారులు, వంతెనలు దెబ్బతిన్నాయి. వీటి మరమ్మతులకు అవసరమైన నిధులతో అంచనాలు పంపినా విడుదల కాకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. మళ్లీ వర్షాకాలం వస్తున్నందున మరమ్మతులు చేయకపోతే వరదలతో ఉన్న కొద్దిపాటి రోడ్లు కూడా దెబ్బతింటే అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదముంది. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు పరిగణనలోకి తీసుకుని రోడ్లు, వంతెనల మరమ్మతులకు తక్షణమే నిధులు కేటాయించాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

మధిరకు మాస్టర్ ప్లాన్

- జోన్ల వారీగా కన్సల్టెన్సీతో రూపకల్పన
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

మధిర: మధిర మున్సిపాలిటీ కేంద్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నందున భవిష్యత్ అవసరాల దృష్ట్యా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. శనివారం మధిర వచ్చిన ఆయన స్థానిక వైఎస్సార్ విగ్రహం నుండి క్యాంపు కార్యాలయం వరకు నడిచి వెళ్తూ ఇరుపక్కలా పరిశీలించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, అధికారులకు పలు సూచనలు చేశారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పరిశ్రమలు, గృహ, వాణిజ్య జోన్లుగా విభజించి మాస్టర్ ప్లాన్ తయారీ బాధ్యతలను అనుభవం కలిగిన కన్సల్టెన్సీకి అప్పగించాలని తెలిపారు. అలాగే, రహదారుల వెంట చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్లాస్టిక్ నిర్మూలనపైనా దృష్టి సారించాలని తెలిపారు. కాగా, రోడ్లపై అక్రమ కట్టడాలు లేకుండా చూస్తూ, ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేయాలని, చిరు వ్యాపారుల కోసం ప్రత్యేక స్థలం కేటాయించాలని చెప్పారు. అంతేకాక మున్సిపాలిటీ నూతన భవన నిర్మాణానికి రూ.3.50 కోట్లు కేటాయించినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.

అండర్ గ్రౌండ్ కేబుల్ పనులపై ఆరా

మధిరలో విద్యుత్ సరఫరా కోసం అండర్ గ్రౌండ్ కేబుల్ వేయనుండగా ప్రతిపాదనలపై క్షేత్రస్థాయిలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. మధిరలోని ఆత్కూరు క్రాస్ నుంచి నందిగామ బైపాస్ రోడ్డు వరకు, ఆర్‌ఈ కాంప్లెక్స్ నుండి బస్టాండ్ వరకు భూగర్భంలో కేబుల్ వేసేలా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో డిప్యూటీ సీఎం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. సుమారు రూ.40 కోట్ల వ్యయంతో 18 కి.మీ. 11 కేవీ కేబుల్, 12 కి.మీ. పరిధిలో ఎల్‌టీ కేబుల్ వేసేలా సిద్ధం కావాలని తెలిపారు. ఖమ్మం ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ రంజిత్ రెడ్డి, మధిర మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, విద్యుత్ శాఖ డీఈలు శ్రీనివాసరావు, హీరాలాల్, ఏడీఈలు అనురాధ, కిరణ్ చక్రవర్తి, నాగమల్లేశ్వరరావు, ఏఈలు అనిల్ కుమార్, అనూష, మైథిలి, గణేష్ పాల్గొన్నారు. కాగా, విద్యుత్ లైన్ పనులపై చర్చిస్తున్న సమయాన అక్కడ ఉన్న మహిళలను డిప్యూటీ సీఎం పలకరించారు. దీంతో వారు తమది దెందుకూరు అని, ఖమ్మం నుంచి వస్తున్నట్లు చెప్పడంతో ఉచిత బస్సు ప్రయాణంపై ఆరా తీశారు.



విద్యుత్ కేబుల్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి


పక్కాగా లెక్క తేల్చేలా...

- పైలట్ ప్రాజెక్టుగా ములుగుమాడులో భూముల రీసర్వే
- గ్రామంలోని 103 సర్వే నంబర్లు, 845 ఎకరాల్లో సర్వేకు నిర్ణయం
- రేపటి నుంచి ఆరంభించనున్న సర్వేయర్లు

ఎర్రుపాలెం: కొన్ని గ్రామాల్లో లెక్కాపత్రం లేకుండా ఉన్న భూముల వివరాలను సర్వేనంబర్ల ఆధారంగా తేల్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో పైలట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలోని ఐదు జిల్లాలను ఎంపిక చేసింది. జిల్లాల్లోని ఒక్కో గ్రామంలో భూములకు సంబంధించి లెక్కల నిర్ధారణకు సర్వే చేయనున్నారు. ఈక్రమాన జిల్లాలోని ఎర్రుపాలెం మండలం ములుగుమాడు కూడా ఎంపికైంది. ఈమేరకు ఉత్తర్వులు అందడంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే గ్రామానికి తూర్పున కట్లేరు, ఉత్తరాన ఐనగాలి, పడమర దిక్కున మధిర మండలం మాటూరు, దక్షిణాన సఖినవీడు రెవెన్యూ గ్రామాలను సరిహద్దులుగా గుర్తించారు.

ఇప్పుడు ఎందుకు..

గత ప్రభుత్వం అమలుచేసిన ధరణి చట్టం ద్వారా భూసమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రస్తుత ప్రభుత్వం భూభారతి పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా సాగు భూముల రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్‌లు కావాల్సి ఉంది. దీంతో పైలట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలోని ఐదు గ్రామాల్లో సర్వేకు శ్రీకారం చుడుతున్నారు. ఇందుకోసం ఎంపికైన ములుగుమాడులో 845ఎకరాల భూమి, 103 సర్వే నంబర్లు ఉన్నాయి. బాధ్యతలను ప్రైవేట్ సంస్థకు అప్పగించిన నేపథ్యాన సర్వేయర్లు సోమవారం నుంచి రీ సర్వే చేయనున్నారు. అన్ని రకాల భూములను సర్వే చేసి ప్రతీ కమతానికి నంబర్ కేటాయిస్తారు. అనంతరం పహాణీల్లో నంబర్లు, విస్తీర్ణంతో సరిపోల్చాక కలెక్టర్‌కు, అక్కడి నుంచి ప్రభుత్వానికి నివేదిస్తారు. కాగా, డ్రోన్లు, అత్యాధునిక పరికరాలతో సర్వే ద్వారా భూముల వివరాలు కచ్చితంగా నిర్ధారణ జరుగుతుందని భావిస్తున్నారు.



ములుగుమాడు పంచాయతీ కార్యాలయం

క్షేత్రస్థాయిలో సర్వే



భూముల రీ సర్వేకు పైలట్ ప్రాజెక్టుగా ములుగుమాడు ఎంపికైంది. సోమవారం నుండి గ్రామంలో భూముల సర్వే మొదలుకానుంది. క్షేత్రస్థాయిసర్వే ద్వారా ఏమైనా సరిహద్దు సమస్యలు ఉంటే తెలుస్తాయి. ఆపై భూముల చిత్రపటం రూపొందిస్తారు. – ఎం.ఉషాశారద, తహసీల్దార్

ఏమిటీ సమస్య

ములుగుమాడు గ్రామానికి ఇప్పటి వరకు నక్ష (భూముల సర్వే పటం) లేదు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో భూములను కుంటల్లో చూపిస్తుండగా, ఈ గ్రామంలో మాత్రం నేటికీ సెంట్లల్లో చూపిస్తున్నారు. నిజాం పాలన సమయాన ములుగుమాడు గ్రామం ఆంధ్రా ప్రాంతంలో ఉండేది. అలాగే, ప్రస్తుత ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా పరిటాల గ్రామం తెలంగాణలో ఉండేది. అప్పట్లో బదలాయింపులో భాగంగా ములుగుమాడును తెలంగాణకు, పరిటాల గ్రామాన్ని ఆంధ్రాకు కేటాయించారు. కానీ ఆ సమయంలో అధికారులు గ్రామ నక్షా తీసుకోకపోవడంతో ఇప్పటికీ భూమి సెంట్లుగానే రికార్డుల్లో ఉండిపోయింది.

పోడు భూములిక పచ్చగా..

గిరిజన రైతుల కోసం 'ఇందిర గిరి జల వికాసం'

- రాష్ట్రంలోనే భద్రాచలం ఐటీడీఏకు ఎక్కువగా..
- ఐదేళ్లలో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 27,488 ఎకరాలు లక్ష్యం
- పైలట్ ప్రాజెక్ట్‌గా చంద్రుగొండ మండలం ఎంపిక

భద్రాచలం: గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములను సారవంతం చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. పోడు భూములకు విద్యుత్ సరఫరా లేక, అటవీ శాఖ అనుమతులు రాక తీవ్రంగా ఇబ్బంది పడుతున్న గిరిజనులకు 'సౌర నీరు' అందించేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. రాష్ట్రంలో పట్టాలు కలిగిన పోడు భూముల హక్కుదారులకు 'ఇందిర గిరి జల వికాసం' పేరిట కొత్త పథకాన్ని చేపట్టగా సీఎం రేవంత్ రెడ్డి సోమవారం నాగర్ కర్నూల్ జిల్లాలో అధికారికంగా ప్రారంభించనున్నారు. పైలట్ ప్రాజెక్టుగా భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని చంద్రుగొండ మండలంలోని పలు గ్రామాలను ఎంపిక చేశారు. అయితే రాష్ట్రం మొత్తం మీద ఏజెన్సీ ప్రాంతం అధికంగా ఉన్న భద్రాచలం ఐటీడీఏకే అత్యధిక నిధులు కేటాయించడంతో జిల్లాలోని అనేక మంది గిరిజనులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది.

పోడు భూములు సాగులోకి తెచ్చేందుకే..

భద్రాచలం ఐటీడీఏ పరిధిలో అనేక ఏళ్లుగా పోడు భూముల ఆధారంగానే ఎంతోమంది గిరిజనులు జీవిస్తున్నారు. వీరికి దివంగత నేత వైఎస్సార్ హయాంలో హక్కు పత్రాలు అందజేశారు. ఆ తర్వాత కూడా కొంతమందికి హక్కు పత్రాలు అందాయి. అయితే ఈ భూములకు సాగు నీరు లేక గిరిజన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వీరికి ఉచిత విద్యుత్ అందజేయాలంటే ఆర్థిక భారంతో పాటు అటవీ శాఖ క్లియరెన్స్ ప్రధాన అడ్డంకిగా మారింది. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం సోలార్ విద్యుత్ ద్వారా పంప్‌సెట్లను అందించాలని నిర్ణయించింది. తద్వారా వచ్చే ఐదేళ్లలో పోడు సాగుదారులందరికీ సోలార్ పంప్ సెట్లకు రూ.6 లక్షల చొప్పున నిధులు విడుదల చేయనుంది.



రాయికంపాడులో ఏర్పాటు చేసిన సోలార్ పంప్‌సెట్ వద్ద ఉద్యోగి

పథకం అమలు ఇలా..

ఈ పథకం లబ్ధిదారులకు ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించింది. రెండున్నర ఎకరాల పొలం ఉన్న రైతును సింగిల్ యూనిట్‌గా గుర్తించింది. అంతకంటే తక్కువగా ఉన్న రైతులను గ్రూప్‌గా ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం ఈనెల 25 వరకు దరఖాస్తులు స్వీకరించి రైతులను గుర్తించాలి. జిల్లా స్థాయిలో ఈనెల 30 నాటికి సర్వే, ఇతర పనుల టెండర్లు ఖరారు చేసి, జూన్ 25 నాటికి ఎంపిక చేసిన ప్రాంతాల్లో పనులు ప్రారంభించేలా షెడ్యూల్ ప్రకటించారు. జూన్ 26 నుంచి మార్చి 31 వరకు భూముల అభివృద్ధి, బోరు బావుల తవ్వకం, సోలార్ పంపుసెట్ల ఏర్పాటు, ఇతర పనులు పూర్తి చేయాలి. జిల్లా స్థాయిలో పథకం అమలుకు కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు.

రానున్న ఐదేళ్లలో జిల్లాకు కేటాయింపులు ఇలా..

సంవత్సరం	రైతులు	పోడు ఎకరాలు
2025 - 26	550	1,516
2026 - 27	2,809	6,483
2027 - 28	2,809	6,483
2028 - 29	2,809	6,483
2029 - 30	2,809	6,483
మొత్తం	11,786	27,448

భద్రాచలం ఐటీడీఏకు భారీగా..

రాష్ట్రంలో 2025–26 నుంచి 2029–30 వరకు ఆరు లక్షల ఎకరాలను జల వికాసం పథకంలోకి తీసుకురానున్నారు. అందులో జిల్లాలోనే అత్యధికంగా 1.96 లక్షల ఎకరాల భూమి సాగులోకి తెచ్చేలా ప్రణాళిక రూపొందించడం విశేషం. కాగా, ఈ పథకానికి భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని చంద్రుగొండ మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇప్పటికే బెండాలపాడు, రాయికంపాడు తదితర గ్రామాల్లో సోలార్ పంప్‌సెట్లు అమర్చి ట్రయల్ రన్ నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో ఈ పథకం ప్రారంభమయ్యాక జిల్లాలో మొదలు పెట్టనున్నారు.

గిరిజన పోడు రైతులకు పూర్తి సబ్సిడీ



పోడు హక్కు పత్రాలున్న భూముల్లో సాగు చేస్తున్న గిరిజన రైతులకు పూర్తి సబ్సిడీతో ఈ పథకం అమలు జరగనుంది. ప్రభుత్వం ఇప్పటికే విధి విధానాలు ప్రకటించింది. ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు పైలట్ ప్రాజెక్టుగా చంద్రుగొండ మండలంలో ట్రయల్ రన్ నిర్వహించాం.
– డేవిడ్ రాజ్, ఐటీడీఏ ఏపీఓ జనరల్

క్లుప్తంగా

మత్స్యకారులకు ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లు అందజేస్తున్న మత్స్యశాఖ అధికారి

కూసుమంచి: పాలేరులోని పీవీ నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో పది జిల్లాల మత్స్యకారులకు ఇస్తున్న మూడు రోజుల శిక్షణ శనివారం ముగిసింది. 'జలాశయాల్లో మత్స్య అభివృద్ధి – యాజమాన్య పద్ధతులు' అనే అంశంపై ఇచ్చిన శిక్షణకు ఖమ్మం, నిజామాబాద్, హనుమకొండ, సూర్యాపేట, కామారెడ్డి, కుమురంభీం ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, సిరిసిల్ల జిల్లాల మత్స్యకారులు పాల్గొన్నారు. కాగా, ముగింపు సమావేశంలో సూర్యాపేట జిల్లా మత్స్యశాఖ అధికారి బి.నాగులునాయక్ మాట్లాడుతూ.. శిక్షణను మత్స్యకారులు సద్వినియోగం చేసుకుని మత్స్య అభివృద్ధి సాధించాలని, తద్వారా రాష్ట్రాన్ని ఆక్వా హబ్‌గా మార్చాలని సూచించారు. చేపల పెంపకంతో పాటు మార్కెటింగ్ కూడా కీలకమైనందున మెళకువలు నేర్చుకోవాలని పేర్కొన్నారు. మత్స్యపరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్‌తో పాటు శాస్త్రవేత్తలు శాంతన్న, రవీందర్, నాగరాజు మాట్లాడగా శిక్షణలో పాల్గొన్న వారికి నైపుణ్య సర్టిఫికెట్లు అందజేశారు.

కాంటాల జాప్యంపై రైతు ఆగ్రహం



రహదారిపై ధాన్యం బస్తాలు వేసిన రైతు హన్మంతరావు

నేలకొండపల్లి: ధాన్యం కాంటాల్లో జాప్యం జరుగుతుండడంతో ఓ రైతు రోడ్డుపై ధాన్యం పోసి నిప్పంటించేందుకు యత్నించాడు. మండల కేంద్రంలోని మార్కెట్‌లో ఏర్పాటు చేసిన డీసీఎంఎస్ కేంద్రానికి 50 రోజుల కిందట తాతా హనుమంతరావు ధాన్యం తీసుకొచ్చాడు. ఇప్పటివరకు కాంటా వేయకపోగా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తుండడంతో శనివారం ఆయన బోదులబండ – నేలకొండపల్లి రహదారిపై ధాన్యం బస్తాలను వేసి నిప్పంటించేందుకు యత్నించాడు. దీంతో సహచర రైతులు అడ్డుకోగా, తహసీల్దార్ వెంకటేశ్వర్లు చేరుకుని నచ్చజెప్పారు. త్వరగా కాంటా వేయిస్తామని నిర్వాహకులు చెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది.

హోరాహోరీగా నెట్‌బాల్ పోటీలు

జనగామ: జనగామ జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి 8వ సబ్ జూనియర్ అండర్‌–16 నెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి 620 మంది బాలబాలికలు పోటీలకు హాజరయ్యారు. ట్రెడిషనల్, ఫాస్ట్–5, మిక్స్‌డ్ కేటగిరీల్లో క్రీడాకారులు తలపడుతున్నారు. ట్రెడిషనల్, ఫాస్ట్–5 కేటగిరీలకు సంబంధించి బాలుర, బాలికల పోటీలు శనివారం ముగియగా, మిక్స్‌డ్ డబుల్ నెట్‌బాల్ పోటీలు శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. కాగా, ట్రెడిషనల్, ఫాస్ట్–5 కేటగిరీల బాలుర, బాలికల విభాగంలో నారాయణపేట, మేడ్చల్ జిల్లాలు సత్తా చాటాయి. ట్రెడిషనల్ కేటగిరీలో నారాయణపేట, కరీంనగర్ మొదటి రెండు స్థానాల్లో నిలవగా హైదరాబాద్, ఖమ్మం సంయుక్తంగా మూడో స్థానం దక్కించుకున్నాయి. ఇక బాలికల విభాగంలో మేడ్చల్, నల్లగొండ మొదటి రెండు స్థానాలు చేజిక్కించుకోగా, మూడో స్థానాన్ని జనగామ, ఖమ్మం పంచుకున్నాయి. ఫాస్ట్–5 కేటగిరీ బాలుర విభాగంలో నారాయణపేట, ఖమ్మం జట్లు మొదటి రెండు స్థానాలు సాధించాయి. అలాగే, మహబూబ్‌నగర్, కుమురం భీం ఆసిఫాబాద్ మూడో స్థానం సంయుక్తంగా దక్కించుకున్నాయి. ఇక బాలికల విభాగంలో మేడ్చల్, ఖమ్మం జట్లు విజేతగా నిలవగా జనగామ, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల జట్లు సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాయి. కాగా, మిక్స్‌డ్ డబుల్స్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగియనున్నాయి.

చోరీ కేసులో నిందితుడి ఆత్మహత్యాయత్నం

తిరుమలాయపాలెం: చోరీ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి బంగారు ఆభరణాలు అప్పగించే విషయమై పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఎర్రగడ్డ గ్రామానికి చెందిన నల్లమల్ల ప్రతాప్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు బంగారు నగలతో పాటు నగదు ఎత్తుకెళ్లారు. ఈ క్రమాన విచారణ చేపట్టిన పోలీసులు అదే గ్రామానికి చెందిన సందీప్‌ను అదుపులోకి తీసుకోగా చెవిదిద్దులు తిరిగి ఇచ్చి, నెక్లెస్ మరో వ్యక్తి వద్ద ఉందని చెప్పాడు. పోలీసులు శనివారం సందీప్‌తో పాటు ఇంకో వ్యక్తిని విచారించి ఆభరణాలు ఇచ్చేయాలని సూచించి పంపించారు. దీంతో సందీప్ ఇంటికి వెళ్లాక, అక్కడి నుంచి తిరుమలాయపాలెం సొసైటీ గోదాం వెనకాలకు చేరుకుని పురుగుల మందు తాగాడు. విషయం కుటుంబీకులకు తెలియడంతో ఆయన్ను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కాగా, సందీప్‌పై గతంలో పోక్సో కేసు కూడా ఉందని తెలిసింది.

నీటి కుంట.. పంటకు లాభమంట..

'ఫాం పాండ్'ల నిర్మాణం.. రైతన్నకు వరం..

- నీటి నిల్వతో కీలక దశలో పంటలకు ఉపయోగం
- సబ్సిడీ ద్వారా సాయం అందిస్తున్న వ్యవసాయ శాఖ
- ఉపాధి హామీ పథకంలోనూ చేయూత



ఏన్కూరు మండలంలో ఫాం పాండ్ వద్ద రైతు (ఫైల్)

వైరా: వర్షాలు సకాలంలో కురవడం లేదు.. ఒకవేళ కురిసినా.. పంటలకు అనుకున్న స్థాయిలో సరిపోవడం లేదు. ఓవైపు వ్యవసాయ బావులు తవ్వుస్తున్నారు. మరోవైపు బోర్ల మీద బోర్లు వేస్తున్నారు. అయినా పంటకు కీలక దశలో సాగు నీరు అందించడం కష్టంగా మారింది. దీంతో వర్షం కురిసినప్పుడు నీటిని నిల్వ చేసుకోవడమే ఇప్పుడు చేయాల్సింది. ప్రధాన మంత్రి కృషి సంచార్ యోజన పథకం కింద వ్యవసాయ శాఖ ఫాం పాండ్‌లను నిర్మిస్తోంది.

నీటి కుంటల ఏర్పాటు..

రైతులు పొలాల్లోనే చిన్నపాటి కుంటలను నిర్మించుకుంటే ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ అందిస్తుంది. 20 మీటర్ల అడ్డం, 20 మీటర్ల పొడవు, 3 మీటర్ల లోతుతో కుంటను తవ్వేందుకు రూ.1.50 నుంచి రూ.2 లక్షలు కానుంది. ఇందులో దాదాపు 8.94 లక్షల లీటర్ల నీరు నిల్వ ఉండటమే కాక రెండున్నర ఎకరాలకు సరిపోతుంది. కుంటను తవ్వినప్పుడు వచ్చే మట్టిని నాలుగు వైపులా ఒడ్డు మాదిరిగా పోయాలి. నాలుగువైపులా వాలు వచ్చేలా చూడాలి. అడుగున, అన్నివైపులా రాళ్లు లేకుండా చేసి, చెక్కదిమ్మతో గట్టి పడేలా చేసి, ప్లాస్టిక్ షీట్లు వేయాలి.



నిర్మాణ దశలోని ఫాం పాండ్

నీరు ఇంకకుండా..

కుంటల్లో నిల్వ చేసుకున్న నీరు, మట్టి రకాన్ని బట్టి భూమిలోకి ఇంకిపోతుంది. ఇసుక నేలల్లో అయితే దాదాపు 70 శాతం నీరు ఇంకుతుంది. ప్లాస్టిక్ షీట్ వేసి నీరు ఇంకిపోకుండా చేయవచ్చు. 250 మైక్రాన్‌ల మందం గల ప్లాస్టిక్ షీట్ అనుకూలంగా ఉంటుంది. ఇది 7–9 మీటర్ల వెడల్పుతో లభిస్తుంది. కుంట తవ్వాక ప్లాస్టిక్ షీట్‌ను బిగుతుగా అడుగు భాగం నుంచి పైకి పరవాలి.

డ్రిప్ ద్వారా పంటలకు..

చాలా మంది రైతులు ఫాం పాండ్‌లోని నీటిని డ్రిప్ ద్వారా పంటలకు అందిస్తున్నారు. ఏన్కూరు, తిరుమలాయపాలెం, బోనకల్, ఎర్రుపాలెం మండలాల్లో ఈ కుంటల ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయి. అవసరమైన రైతులు ఆయా మండలాల వ్యవసాయాధికారులు, ఉపాధి హామీ పథకం అధికారులను కలిసి దరఖాస్తు చేస్తే సరిపోతుంది.

ఉపయోగాలు ఎన్నో..

ఈ పద్ధతిలో నీరు ఇంకిపోదు. కలుపు మొక్కలు పెరగవు. ఈ నీటిని అవసరాన్ని బట్టి ఉపయోగించుకోవచ్చు. చేపలనూ పెంచవచ్చు. ప్లాస్టిక్‌కు సాగే గుణం ఉండటంతో అధిక నీటి ఒత్తిడిని సైతం తట్టుకుంటుంది. వాతావరణ కాలుష్యం ఉండదు. బోర్లున్న రైతులు మోటార్‌ను కుంటకు అనుసంధానం చేస్తే కరెంట్ వచ్చినప్పుడు నిండుతుంది.

పట్టాలిస్తే ఇబ్బంది ఉండదు...



ఐదేళ్లుగా ఫాం పాండ్ ద్వారా ఎకరం పొలం సాగు చేస్తున్నాను. జనవరి ఫిబ్రవరి నెలల్లో ఫాం పాండ్లలో నీరు నిలవడం లేదు. నీళ్లు నిలిచేలా ఉండాలంటే నల్ల పట్టాలు ఇవ్వాలి. అధికారులకు విన్నవించాము కానీ పరిష్కారం కాలేదు.

–బాదావత్ నామా,
శ్రీరాంపురం తండా, ఏన్కూరు మండలం

ఫాం పాండ్‌తో లబ్ధి..



ఐదేళ్లుగా ఫాం పాండ్ ద్వారా వ్యవసాయం చేస్తున్నా. వేసవిలో సైతం నీళ్లు ఉండటంతో చేపలు పెంచుకుంటున్నాను. ఏడాదికి 2 నుంచి 3 క్వింటాళ్ల చేపలు లభిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితుల్లోనూ వ్యవసాయానికి లోటు ఉండటం లేదు.

–బానోత్ నాగబాబు,
శ్రీరాంపురం తండా, ఏన్కూరు మండలం

కార్పొరేట్ కళాశాల పిలుస్తోంది..

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- నాలుగు జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి అవకాశం
- 107 సీట్ల కోసం ఈనెల 31 వరకు గడువు



ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు ఇంటర్మీడియట్ విద్య కోసం కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం నుంచి ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. జిల్లాలోని శ్రీచైతన్య, కృష్ణవేణి, రెజొనెన్స్, సీవీ రామన్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 107 సీట్లలో ఈ అభ్యర్థులు చేరవచ్చు. రిజర్వేషన్ ప్రాతిపదికన అభ్యర్థులకు సీట్లు కేటాయిస్తారు.

వీరికి అవకాశం..

పదో తరగతిలో 7 జీపీఏ లేదా 400 మార్కులకు పైన సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్, ఆశ్రమ, ప్రభుత్వ వసతిగృహాలు, ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, కేజీబీవీ, నవోదయ, కేంద్రియ విద్యాలయాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే ఈ కళాశాలల్లో చేరేందుకు అర్హులు. దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థినీ విద్యార్థులు తప్పని సరిగా గడిచిన ఏడేళ్ల స్టడీ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకంలో ఉత్తీర్ణులైన విద్యార్థులు, సీబీఎస్ఈ ప్రభుత్వ పాఠశాలలు అంటే కేంద్రియ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాల్లో చదివిన విద్యార్థులు వారి ఎస్ఎస్‌సీ వివరాలు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలోని ఈ–పాస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి.

రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు

ఈ కళాశాలల్లో విద్యను అభ్యసించేందుకు రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లను కేటాయించారు. ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్ ఉండగా.. అందులో 9 శాతం మాదిగ, అనుబంధ కులాలకు, 5 శాతం మాల అనుబంధ కులాలకు, ఒక శాతం షెడ్యూల్ కులాల్లోని ఇతర కులాలకు కేటాయించారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ తదితర వాటిల్లో కూడా ఈ రిజర్వేషన్ విధానమే అమలు కానుంది. మొత్తం 107 సీట్లలో ఎస్సీలకు 46 సీట్లు కేటాయించారు. అలాగే మైనార్టీలకు 5, ఎస్టీలకు 26, బీసీలకు 17, బీసీ–సీలకు 8, ఈబీసీలకు 5 కేటాయించారు. మొత్తం సీట్లలో 3 శాతం వరకు అంగవైకల్యం కలిగిన విద్యార్థులకు కేటాయిస్తారు. రిజర్వేషన్ల మేరకు అభ్యర్థులు లేనిపక్షంలో ఇతర కేటగిరిలోని విద్యార్థులకు ఆ సీట్లు కేటాయిస్తారు.

కావాల్సిన పత్రాలు

అర్హత కలిగిన అభ్యర్థులు ఆయా ధ్రువీకరణ పత్రాలతో ఈ–పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం పదో తరగతి ధ్రువీకరణ పత్రం, మీసేవ నుంచి పొందిన కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, వసతి గృహ విద్యార్థి అయితే సంక్షేమ అధికారి ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్ బుక్, ఫిజికల్లీ చాలెంజ్‌డ్ పత్రాలు ఉండాలి.

అభ్యర్థులు సద్వినియోగం చేసుకోండి..



పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో కార్పొరేట్ కళాశాలల్లో చేరేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ–పాస్ వెబ్‌సైట్‌లో ఈ నెల 31లోగా దరఖాస్తులు చేసుకోవాలి. వివరాలు తెలుసుకునేందుకు ఐడీఓసీలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో పనివేళల్లో సంప్రదించవచ్చు.

కస్తాల సత్యనారాయణ,
ఎస్సీ డీడీ, ఖమ్మం

ఎస్సెస్సీ ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు

మొదటి ఐదుగురికి విమానయానం కూడా..



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మంగాంధీచౌక్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి ప్రతిభ చాటిన విద్యార్థినీ, విద్యార్థులకు మిత్రా ఫౌండేషన్ ఆధ్వర్యాన రూ.3 లక్షల నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బహుమతులు అందజేసి అభినందించారు. మొదటి బహుమతి రూ.25 వేలతో పాటు ల్యాప్‌టాప్‌ను పఠావ వెన్నెల, మాఘం యశ్వంత్ రూ.25 వేలు, చింతోజు సాయి రూ.15 వేలు అందుకోగా, తిరుమలదాసు మాధురి, రామిశెట్టి ఉమ, ఆవుల శ్రీమన్య, గోడ లక్ష్మి, పుచ్చకాయల భవ్య, చందా భావనకు రూ.10 వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. తొలి ఐదు స్థానాల్లో నిలిచిన ఐదుగురు విద్యార్థులను ఢిల్లీకి విమానంలో మూడు రోజుల యాత్రకు తీసుకెళ్తామని తెలిపారు. మిత్ర ఫౌండేషన్ డైరెక్టర్లు రంగా శ్రీనివాస్, పోలవరపు శ్రీనివాస్, చారుగుండ్ల రవికుమార్, చెరుకూరి యుగంధర్, నాగసాయి నగేశ్, ప్రసేన్, ఎన్ఆర్ఐ ఫౌండేషన్ బాధ్యులు, వైరా ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దొడ్డా వరప్రసాద్, కిరణ్‌కుమార్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు

ఖమ్మంక్రైం: ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసిన వ్యక్తిపై ఖమ్మం త్రీటౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వరంగల్‌కు చెందిన మహ్మద్ మున్వర్‌అలీ ఖమ్మం సారథినగర్‌లో కొంతకాలం నుంచి ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమాన తనకు పలువురు ప్రముఖులతో పరిచయం ఉన్నందున వైద్య, ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని స్థానికులను నమ్మించాడు. 2023 డిసెంబర్‌లో పలువురి వద్ద రూ.19 లక్షలు తీసుకుని ఉద్యోగాలు ఇప్పించకపోగా, ఆరు నెలలుగా మున్వర్‌అలీ కనిపించడం లేదు. దీంతో కవిరాజ్‌నగర్‌కు చెందిన విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్‌బాబు తెలిపారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు పారదర్శకంగా చేపట్టాలి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న టీపీటీఎఫ్ బాధ్యులు

ఖమ్మంసహకారనగర్: రానున్న విద్యాసంవత్సరంలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని టీపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా శనివారం డీఈఓ సామినేని సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏవీ నాగేశ్వరరావు, వెంగళరావు మాట్లాడుతూ.. గతేడాది ఖాళీగా ఉన్న పాఠశాలలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారని, ఆ తర్వాత ఏర్పడిన ఖాళీలను పదోన్నతులు, డీఎస్సీ నియామకాలతో భర్తీ చేశారని తెలిపారు. కానీ నేటికీ కూడా డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులు వారి మాతృస్థానానికి వెళ్లలేదని, తద్వారా ఒకే పాఠశాలలో ఒకే సబ్జెక్టుకు ఇద్దరు ఉపాధ్యాయులు పని చేయాల్సి వస్తోందని చెప్పారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని కోరారు.

విద్యావ్యవస్థ సమర్థవంతంగా కొనసాగాలి

సైట్ డైరెక్టర్ విజయలక్ష్మీబాయి



మాట్లాడుతున్న సైట్ డైరెక్టర్ విజయలక్ష్మీబాయి

ఖమ్మంసహకారనగర్: విద్యావ్యవస్థను సమర్థవంతంగా కొనసాగేలా అందరూ కృషి చేయాలని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ట్రెనింగ్ (సైట్) డైరెక్టర్ విజయలక్ష్మీబాయి సూచించారు. ఖమ్మంలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఎంఈఓలు వారి పరిధి పాఠశాలల్లో బోధన నాణ్యత పెంచేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రతీనెల ఉపాధ్యాయుల సమీక్షలు నిర్వహించి, ప్రణాళికపై సూచనలు చేయాలని తెలిపారు. ఆ తర్వాత బడిబాట, పాఠ్యపుస్తకాల సరఫరా, ఏకరూప దుస్తులు సిద్ధం చేయడంపై సూచనలు చేసిన ఆమె శిక్షణలో ప్రతిభ కబబర్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సామినేని సత్యనారాయణ, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, అకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ రాజశేఖర్, ఎంఈఓలు పాల్గొన్నారు. కాగా, పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఉపాధ్యాయుల సర్దుబాటు పూర్తి చేయడమే కాక విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం సమకూర్చాలని, అన్ని పాఠశాలల్లో తాగునీటి వసతి కల్పించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు సైట్ డైరెక్టర్ విజయలక్ష్మీబాయికి వినతిపత్రం అందజేశారు. ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గండు యాదగిరి, ఎస్కే మన్సూర్, నాయకులు పోతగాని వెంకన్న, పాశం శ్రీనివాస్, రామకృష్ణ, రాజు, పెనుగొండ ఉపేందర్‌రావు పాల్గొన్నారు.



కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాల్లో భాగంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, తన సోదరుడితో కలిసి పితృదేవతలకు పిండప్రదానం చేయడంతో పాటు కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. అలాగే, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రఘురాం రెడ్డి కూడా త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు.

సమస్యలు పరిష్కరించేంత వరకూ పోరాటం



ధర్నాలో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్



కేఎంసీ ఎదుట ధర్నాలో పాల్గొన్న స్థానికులు

కేఎంసీ ఎదుట ధర్నాలో సీపీఎం నాయకులు పోతినేని, నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులతోపాటు ఇతర సంక్షేమ పథకాలు అమలయ్యే వరకూ పోరాడుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు తెలిపారు. సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కేఎంసీ కార్యాలయం ఎదుట శనివారం ప్రజలతో కలిసి ధర్నా చేశారు. పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అధ్యక్షతన జరిగిన సభలో పోతినేని మాట్లాడుతూ.. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పదేళ్లు సాగదీస్తే, ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాల విషయంలో అదే ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంపై నిందలు వేస్తున్న ప్రస్తుత పాలకులు.. మూసీ సుందరీకరణ, అందాల పోటీలకు ఉన్న నిధులు ఆరు గ్యారంటీల అమలుకు ఎందుకు వెచ్చించడం లేదని ప్రశ్నించారు. ఇకనైనా కాంగ్రెస్ శ్రేణులకు కాకుండా అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వడంతో పాటు పింఛన్ల కోసం అందిన దరఖాస్తులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా, మున్నేరు రిటైనింగ్ వాల్, తీగల వంతెన నిర్మాణాలతో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లాకు వినతిపత్రం అందజేశారు. పార్టీ నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీనివాసరావు, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, పొన్నం వెంకటేశ్వర్లు, తుమ్మా విష్ణువర్ధన్‌రెడ్డి, బండారు రమేష్, ఎంఏ జబ్బార్, ఎస్.నవీన్‌రెడ్డి, తిరుపతిరావు, మీరా సాహెబ్, కార్పొరేటర్ యర్రా గోపి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాలల మరమ్మతులకు రూ.82.50 లక్షలు

మధిర: నియోజకవర్గంలోని 31 పశు వైద్యశాలల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. భవనాల స్లాబ్, గోడల మరమ్మతులు, కొత్త నిర్మాణాలు, రంగులు వేయించడం, ప్రహరీలు, టాయిలెట్ల నిర్మాణంతో పాటు నీటి వసతి పనులకు గాను రూ.82.50 లక్షలు శనివారం మంజూరయ్యాయి. మధిర నియోజవర్గ కేంద్రంలోని పశు వైద్యశాలతో పాటు సిరిపురం, మడుపల్లి, మాటూరిపేట, ఖమ్మంపాడు, దెందుకూరు, అయిలూరు, చింతకాని మండలంలోని చింతకాని, కొదుమూరు, పొద్దుటూరు, పందిళ్లపల్లి, నాగులవంచ, తిమ్మినేనిపాలెం, బోనకల్ మండలంలోని చిరునోముల, రావినూతల, కలకోట, గోవిందాపురం, ముష్టికుంట్ల పశు వైద్యశాలల్లో మరమ్మతులకు నిధులు కేటాయించారు. అలాగే, ముదిగొండ మండలంలోని ముదిగొండ, మాధాపురం, గోకినపల్లి, వి.కిష్టాపురం, బాణాపురం, పమ్మి, వల్లభితో పాటు ఎర్రుపాలెం మండలంలోని తక్కెళ్లపాడు, ఎర్రుపాలెం, బనిగండ్లపాడు, రేమిడిచర్ల, జమలాపురం, లక్ష్మీపురం గ్రామాల్లో పశు వైద్యశాలల్లో పనులకు నిధులు విడుదలయ్యాయి. కాగా, నియోజకవర్గంలో ఇందిరా డెయిరీ ఏర్పాటు కానుండగా, పశువుల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ముందస్తుగా పశువైద్యశాలల అభివృద్ధి కోసం నిధులు కేటాయించడంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

చింతకాని: పొలం గట్లకు సంబంధించి జరిగిన ఘర్షణలో ముగ్గురిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. మండలంలోని నేరడకు చెందిన అన్నదమ్ములైన కనకపూడి బాబు, ఏసుకు పొలం గట్ల వద్ద ఘర్షణ జరిగింది. ఈ క్రమాన బాబును ఏసు, ఆయన భార్య యశోద, కుమారుడు మహేశ్ అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేయడంతో గాయాలయ్యాయి. ఘటనపై బాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి

తల్లాడ: మండలంలోని రామచంద్రాపురానికి చెందిన తొర్లపాటి దాసు (80) వడదెబ్బతో మృతి చెందాడు. రేకుల ఇంట్లో నివాసముంటున్న ఆయన ఎండల కారణంగా శుక్రవారం వడదెబ్బకు గురయ్యాడు. దీంతో కల్లూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స అనంతరం ఇంటికి పంపించారు. ఆ తర్వాత పరిస్థితి విషమించడంతో శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. దాసుకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

పెనుగాలులు, అకాల వర్షం

ఎర్రుపాలెం: మండలంలోని పెగళ్లపాడు, ఎర్రుపాలెం, మీనవోలు తదితర గ్రామాల్లో శనివారం రాత్రి పెనుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పెగళ్లపాడులో చెట్టు విరిగి రేకుల షెడ్‌పై పడగా, అది సైతం కుప్పకూలడంతో సగ్గుర్తి సత్యంకు చెందిన 15 మేకలు మృత్యువాత పడ్డాయి. ఈ సమయాన షెడ్‌లో దాదాపు 100 మేకలు ఉండగా, ఇంకొన్ని గాయపడ్డాయి. మాజీ సర్పంచ్ సగ్గుర్తి రాజేశ్వరి, మాజీ ఎంపీటీసీ సగ్గుర్తి కిశోర్, గ్రామస్తులు కలిసి షెడ్ శిథిలాలను తొలగించారు. కాగా, గ్రామంలో పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు సైతం విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోగా, ఏఈ జి.అనూష ఆధ్వర్యాన సిబ్బంది మరమ్మతులు చేపట్టారు.